క్లుప్తంగా

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



అయిజ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధం కావాలని వారిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రంగంలో గెలుపోటములు సహజం

అలంపూర్ : ప్రతి రంగంలో గెలుపోటముల సహజమని ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. హైదరబాదు నుంచి ధర్మవరం వెళ్తున్న ఆయన అలంపూర్ చౌరస్తా పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని హోటల్ వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురితో చర్చించారు.

ముమ్మరంగా నిర్మాణ పనులు



రాజోళి : మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కొలువైన స్వామి అమ్మవార్లతో పాటు మహాగణపతి, మాతా పార్వతి ఆలయాలు, కల్యాణ మండపాల నిర్మాణం చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠ ఫిబ్రవరి 2న చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శివరాత్రి పండుగ సమయంలో రాజోళిలో జాతర కూడా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సామాజిక అవగాహన కార్యక్రమం

ధరూరు : మండల పరిధిలోని గుడ్డెందొడ్డి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాత బృందం పాటల ద్వారా మూఢ నమ్మకాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, భరోసా కేంద్రాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు, మెసేజ్‌లు షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ షకూర్, సిబ్బంది పాల్గొన్నారు. సూచించారు.

రేపటి నుంచి గ్రామ సభలు

శాంతినగర్ : రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న వెంకట్రామనగర్, జక్కిరెడ్డిపల్లి, జిల్లెడుదిన్నె, 22న బుడమొర్సు, తిమ్మాజిపల్లి, కోయిల్‌దిన్నె, 23న జూలెకల్, రామాపురం, 24న కొంకల, తనగల గ్రామ పంచాయతీల ఆవరణలో గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఆయా తేదీల్లో నిర్వహించనున్న గ్రామ సభల్లో ప్రజలు పాల్గొని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

మనో వైజ్ఞానికుడు యోగి వేమన



గద్వాల న్యూటౌన్ : సమాజంలోని రుగ్మతలను తూర్పారబట్టిన మనో వైజ్ఞానికుడు యోగి వేమన అని రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి అన్నారు. ఆదివారం రెడ్డి సేవా సమితి బాలికల వసతి గృహంలో యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన గొప్ప విప్లవకారుడు వేమన అన్నారు. వేమన ఆశయాలను, ఆలోచనలను అమలు పర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి వెంకట్‌రెడ్డి, హస్టల్ వార్డెన్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- అనుమతులు లేకుండా బట్టీలకు తరలింపు
- మాయమైపోతున్న వృక్ష సంపద
- పట్టించుకోని అధికారులు



అనుమతులు లేకుండా కర్ణాటకకు కట్టెలను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

కేటీదొడ్డి: గ్రామాల్లో పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నరికి కట్టెల మిల్లులకు, ఇటుక బట్టీలకు రవాణాదారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. బీడు భూముల్లో ఉన్న విలువైన చెట్లను రవాణాదారులు నరికి తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మండలంలోని పలు గ్రామాల్లో కర్ణాటకకు చెందిన వ్యాపారులు, స్థానికంగా ఉన్న కట్టెల రవాణాదారులు అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా చెట్లను నరికి మిల్లులకు తరలిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు, పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అడ్డగోలుగా తరలింపు..

ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా బట్టీలకు రాత్రిపగళ్లు రవాణాదారులు తరలిస్తున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకుని అక్రమంగా జరుగుతున్న చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దాడులు చేసిన దాఖలాలే లేవు..

మండలంలో అక్రమ రవాణాదారులు అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం దాడులు చేసిన దాఖాలాలే లేకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నారే తప్పా అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవంగా అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకుని చెట్లను నరికి తరలించడం ద్వారా పర్యావరణానికి నష్టం ఉండని సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆచరణలో మాత్రం రవాణాదారులు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నారు.



అనుమతులు లేకుండా తరలిస్తున్న కట్టెలు(ఫైల్)

కేసులు నమోదు చేస్తున్నాం..

అనుమతులు లేకుండా చెట్లు కొట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కట్టెలు తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి అనుమతులు ఇస్తున్నాం. అక్రమంగా చెట్లు కొట్టి తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైన చెట్లు నరుకుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

- పర్వేజ్ అహ్మద్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



తప్పెట్లమొర్సులో భూములు పరిశీలిస్తున్న అధికారులు



రాజోళిలో రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్

రాజోళి : వ్యవసాయేతర భూముల వివరాల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పి.రామ్మోహన్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమై సర్వేపై చర్చించారు. సర్వే విధి విధానాలు, పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలపై సిబ్బందికి తెలియచేశారు. మండలంలో ఎక్కడెక్కడ వెంచర్లు, ప్లాట్లు ఉన్నాయని, భారత్ మాల రోడ్డు విస్తరణలో భాగంగా ఏ సర్వే నంబర్లలో భూములు పోగా..ఇంకా రైతుబంధు ఖాతాల్లో జమ అవుతుందా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రికార్డులు పరిశీలించి వ్యవసాయేతర భూములు, బీడు భూములు వివరాలను రెవెన్యూ సిబ్బంది సేకరిస్తున్నారు. సర్వేలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది చంద్రకాంత్,రామకృష్ణ, కృష్ణ,నాగరాజు, ఇంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

మల్దకల్ : మండలంలోని తాటికుంట, కుర్తిరావుల చెర్వు, శేషంపల్లి గ్రామాల్లో అధికారులు ఆదివారం ముమ్మరంగా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓ ఖాజాపాష, సర్వేయర్ శేఖర్ సాగుకు యోగ్యం కానీ భూములు పరిశీలించారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం కోసం సర్వే క్షుణ్ణంగా చేస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో సాగుకు నోచుకోని భూములను గుర్తించి వాటిని గ్రామ సభల్లో ఆయా గ్రామాల ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జుబేర్ మొయినుద్దీన్, డీటీ ఘూన్సీరాణి, ఎంపీఓ రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు

గట్టు : సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపులో భాగంగా ఆదివారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తప్పెట్లమొర్సు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప, వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, ఆర్ఐ రాజు, ఏఈఓ తిరుమలేష్ సాగుకు యోగ్యం కాని భూములు, ముంపు భూములు, రియల్ ఎస్టేట్ భూములకు సంబంధించిన వివరాలు సేకరించారు. ప్రభుత్వం రైతు భరోసా అందించనున్న నేపథ్యంలో వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గద్వాలటౌన్ : తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఎస్‌వీ ఈవెంట్ హాల్‌లో జరిగిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ సమావేశానికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డీకే స్నిగ్ధారెడ్డి, చైర్మన్‌గా అబ్రహాం ఎన్నికయ్యారు. సెక్రటరీగా ఎం నర్సింహా, కోశాధికారిగా చందు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, తిరుపతి, బీమయ్య, సీ నర్సింహులు, గోవిందు, రాజశేఖర్ సంయుక్త కార్యదర్శులుగా ఆర్ కృష్ణ, నగేష్, శివ, మునిరెడ్డి, బీ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవి, రజనీకాంత్, రాజేందర్, జగదీష్, రాజశేఖర్, వీరేష్, గీతారెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా తరుణ్ ఎన్నికయ్యారు. కబడ్డీ అసోసియేషన్‌కు చీఫ్ ప్యాట్రన్‌గా ఎంపీ డీకే అరుణ, ప్యాట్రన్‌గా మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని 33 జిల్లాల కబడ్డీ అసోసియేషన్‌లలో తొలి మహిళా అధ్యక్షురాలిగా స్నిగ్ధారెడ్డి ఎన్నిక కావడం విశేషం.

దద్దరిల్లిన 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు'



కళాకారులతో కలిసి పాట పడుతున్న సింగర్ మానస

ధరూరు : ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు' కార్యక్రమం ధరూరు, దోర్నాల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని దోర్నాల, మన్నాపురం, గుడ్డెందొడ్డి తదితర గ్రామాల్లో స్టేట్ కో ఆర్డినేటర్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జి డప్పు స్వామి కళాబృందం ఆట..పాట..మాట కార్యక్రమం ప్రజలను అలరించింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మందకృష్ణ నేతృత్వంలో హైదరాబాద్ నడిబొడ్డున నిర్వహించనున్న దండోరా నగారాను మోగించేందుకు ఇంటికొకరు చొప్పున డప్పుతో నడుం బిగించి కదిలి రావాలని కోరారు. సింగర్ మానస పాటలతో సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాదిగ, జిల్లా గౌరవ సలహాదారులు డ్యాం వెంకటన్న మాదిగ, కన్న మాదిగ, అశోక్ మాదిగ, జిల్లా కో కన్వీనర్ గంజిపేట పరుశరాం మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ మదిగ, మండల ఇన్‌చార్జి చింతరేవుల ఆంజనేయులు మాది, శ్రీనివాస్ మహారాజ్, డప్పు కళాకారుడు షూటింగ్ ఆంజనేయులు, బొజ్జన్న, సవారన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ధరూరు : ఈనెల 25న సంగారెడ్డిలో నిర్వహించనున్న 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మండల సీపీఎం, హమాలీ సంఘం నాయకులతో కలిసి బహిరంగ సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సమాగ్రాభివృద్ధి కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం.. సకల జనుల సంక్షేమం కోసం జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు దేవదాసు, మేకల నర్సింహులు, తిమ్మప్ప, ఆంజనేయులు, ప్రవీణ్, వినయ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'జనవరి 19 ఎల్‌ఐసీకి మైలురాయిలాంటిది'

గద్వాల న్యూటౌన్ : జనవరి 19 ఎల్‌ఐసీకి మైలురాయిలాంటిదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 జనవరి 1956లో ఆర్డినెన్స్ ద్వారా దేశంలోని అన్ని బీమా సంస్థల నియంత్రణ, నిర్వహణ ప్రభుత్వం చేతిలోకి వచ్చిందన్నారు. 1956 నుంచి ఎల్‌ఐసీ కోట్లాది మంది భారతీయుల అభిమానాన్ని, విశ్వాసాన్ని చూరగొని ఎంపిక చేసుకున్న బీమా సంస్థగా నిలిచిందన్నారు. ప్రైవేట్ సంస్థలు ఎన్ని వచ్చినా రెండు దశాబ్దాలు దాటిన తర్వాత కూడా జీవిత బీమా వ్యాపారంలో ఎల్‌ఐసీ అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సమావేశంలో పలువురు ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

ఎర్రవల్లి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ మాదిగ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోదండాపురం పీఎస్‌లో ఆదివారం పోలీస్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ఎదుర్కోలేక మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రామ్మూర్తిని అరెస్ట్ చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, శాంతిరాజు, సుందర్‌రాజు, చిన్న కాశన్న, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఎర్రవల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై స్వాతి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన చాకలి పరుశరాముడు ఈనెల 15న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఆరాతీయగా ఎలాంటి ఆచూకీ లభించ లేదు. ఈ నేపథ్యంలో పరుశరాముడు భార్య శారద ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురుగుతో అవస్థలు



మానవపాడు : మండలంలోని బోరవెల్లి గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు



అయిజ : మండల కేంద్రంలో ఫిబ్రవరిలో నిర్వహించనున్న తిక్కవీరేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు పురోహితులు ముహూర్తం ఖరారు చేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ముహూర్త పత్రికను ఆలయంలో పెట్టి తిక్కవీరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పూజారి లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15 స్వామివారి విగ్రహ ఊరేగింపు, 16న ప్రభోత్సవం, 17న రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వీరభద్రప్ప

గట్టు : గట్టు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కలెక్టరేట్ ఏఓగా విధులను నిర్వహిస్తున్న వీరభద్రప్పకు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్‌గా పని చేస్తున్న సరితారాణిపై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ సరితారాణిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప ఆదివారం స్థానిక అధికారులతో కలసి సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

పేకాట స్థావరంపై దాడి



ఎర్రవల్లి : గుట్టు చప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం కోదండాపురం పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్సై స్వాతి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, సత్యారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఈశ్వరయ్య, కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద 5 మొబైల్స్, రూ.1220 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు

మల్దకల్ : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ 1975– 76 పదో తరగతి పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మల్దకల్ ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 50ఏళ్ల తర్వాత జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రామిరెడ్డి, ప్రభావతి, జానకిరాములు, సవారన్న, లక్ష్మన్నలతో పలువురు ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ పాఠశాలకు తమవంతు సాయంగా రూ.1.50లక్షలతో సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేశారు. అదే విధంగా పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మనసాని నాగరాజు, పటేల్ జనార్దన్‌రెడ్డి, సురేందర్, బుచ్చిరెడ్డి, రాజశేఖర్, తిమ్మప్ప, రంగారెడ్డి, సంధ్యారాణి, గిరిజాకుమారి, రామిరెడ్డి, కృష్ణయ్య గౌడ్, కాంతారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగానికే.. సేవలకు కాదు



డీవైఎస్ఓ ఆనంద్ దంపతులును సన్మానిస్తున్న నాయకులు

గద్వాలటౌన్ : వ్యాయామ ఉపాధ్యాయుడు నుంచి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా విశేష సేవలందించిన బీఎస్ ఆనంద్‌కు ఉద్యోగ విరమణ వయస్సుకే తప్ప ఆయన సేవలకు కాదని వివిధ సంఘాల నాయకులు, అధికారులు పేర్కొన్నారు. డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడా సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనంద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బీఎస్ ఆనంద్ శిక్షణలో అనేక మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారని కొనియాడారు. విధి నిర్వహణతో పాటు వివిధ సామాజిక సేవ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టరన్నారు. పీఈటీలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులను సమన్వయం చేసుకుంటూ క్రీడల సమగ్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఏసీపీ కిరణ్ కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాజేష్, పీయూ మాజీ వీసీ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం..



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అయిజ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలన్నీ అములు చేసేదాక ప్రజల పక్షాన పోరాడుతామని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో వారు మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి హామీలు అమలు చేసినట్లు చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఇప్పటివరకు రైతులందరికీ రుణమాఫీ కాలేదని, రైతు భరోసా పథకం అసలే అమలు చేయలేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీల ఊసే ఎత్తడం లేదని పల్లయ్య విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేష్, మాధవ్, రాముడు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రకాష్

అయిజ : దళిత నిరుద్యోగ యువతకు అభయ హస్తం పేరుతో ఆర్థిక సహాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత నిరుద్యోగులకు అంబేడ్కర్ అభయ హస్తం కింద రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని, భూమిలేని ప్రతి కుటుంబానికి 3 ఎకరాల భూమి, స్వయం ఉపాధి కోసం రూ.5 కోట్లు గ్యారెంటీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

అఖిలపక్ష కమిటీ సమావేశం

అయిజ : మండల కేంద్రంలో ఆదివారం అఖిల పక్షం కమిటీ నాయకుల సమావేశం నిర్వహించారు. అఖిలపక్షం కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాలక వర్గాన్ని సన్మానించాలని తీర్మానం చేసినట్లు ప్రకటించారు. ఈనెల 25న ఉదయం 10 గంటలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పాలకవర్గాన్ని సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమంతు, వినోద్ కుమార్, మద్దిలేటి, విజయభాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇటిక్యాల : మండల పరిధిలోని శివనంపల్లి గ్రామానికి చెందిన వెంకటరాజారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి ఆదివారం వారి భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, సోమిరెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.